# పుల్వామా 'ఎదురుకాల్పులు' రక్తమోడుతున్న కాశ్మీర్

**కాశ్మీర్** రక్తమోడుస్తూ వుంది. 2018 డిసెంబర్ 6న కాశ్మీర్, పుల్వామా జిల్లాలోని రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సైనికులు జరిపిన కాల్పులలో 7 గురు పౌరులు మరణించారు. ఇలాంటి అనేకానేక ఘటనలలో మరణిస్తున్న సుదీర్ఘమైన, అంతులేని జాబితాకు తాజా సంఘటనలో మృతులను జోడించుకోవాలి. ఈ ప్రత్యేక ఘటనలో ముగ్గుర్ని 'మిలిటెంట్లు'గా ముద్రవేశారు; కాగా మిగిలిన ముగ్గురు, పౌరులు. ఈ ముగ్గురు పౌరులు, తుపాకి కాల్పులు విని హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకోగా, ఎదురు కాల్పులపేరిట వారిని హతమార్చారు. ఒక పాఠశాల విద్యార్థి కూడా ఈ కాల్పులలో ప్రాణాలు కోల్పోవటం మరింత విషాదకరం.

కాశ్మీర్ రాజుగా హరిసింగ్ గద్దెనెక్కటానికి ఒప్పందం జరిగిన నాటినుండి భారత పాలక వర్గాలు దానిని ఓ సాధనంగా మలచుకొని, ఒప్పందంలోని ఒక్కో అంశాన్ని అతిక్రమిస్తూ, రద్దుచేస్తూ వచ్చారు. ప్రజల నమ్మకాన్ని పెంపొందించుకోవటానికి వారితో బంధాన్ని బలోపేతం చేసుకోవటానికి నిర్దిష్ట చర్యలతో వారేనాడూ ప్రయత్నించలేదు. కుటిల పన్నాగా లతో, ప్రలోభాలతో, బలప్రయోగంతో, క్రూర నిర్బంధంతో, దొడ్డిదోవన, అన్యాయంగా కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి అనే అంశాన్ని అణగ దొక్కేందుకు ప్రయత్నించారు. తద్వారా రాజ్యాంగపరంగానూ, రాజకీయపరంగానూ కాశ్మీర్ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలి కొదిలేశారు. కేంద్రంలో ఎక్కువ కాలం అధికారంలోనున్న కాంగ్రెస్‌పార్టీ ఈ విధానాలను ప్రారంభించి, కొనసాగించగా బిజెపి నాయకత్వం లోని ప్రభుత్వం వానినే ఉన్మాదపూరితంగా అమలుచేస్తూ వస్తోంది.

కాశ్మీర్‌లో కూడా ప్రజాస్వామిక పాలన వుందని భారత పాలకవర్గాలు నాటకమాడు తున్నాయి. కాశ్మీర్‌లో తన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరచటానికిగానీ లేదా తన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పరచటానికిగానీ లేదా గవర్నర్ ద్వారా పాలన సాగించటానికిగానీ కాంగ్రెస్‌పార్టీ ఏనాడూ వెనకడుగువేయలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు కాశ్మీర్ ప్రజలు వోటువేశారా లేదా అనే దానితో వారికి నిమిత్తం లేదు; అలాగే ప్రజాస్వామిక విధానాలు అనుసరించబడినాయా లేదా అనే దానితో వారికి నిమిత్తం లేదు. అవినీతికర, తప్పుడు, బలప్రయోగ విధానాలతో వారు ప్రభుత్వాలను ఏర్పరచటం, గద్దె దించటం జరుగుతూ వస్తోంది. ఇక్కడ పాలకవర్గ పార్టీలు కాశ్మీర్‌లో తమ ప్రజావ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు ప్రజాస్వామిక ముద్ర వుందని ప్రకటించుకోవటం మినహా, వారు ఇకదేని గురించీ పట్టించుకునేది లేదు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి రాగానే, అది కూడా కాశ్మీర్‌లో తన శైలిలో తాను ఈ రాజకీయ క్రీడనే కొనసాగించింది.

కాశ్మీర్‌కు ప్రత్యేక రాజకీయ హోదా కల్పించే రాజ్యాంగంలోని 370వ అధికరణానికి బిజెపి ఆదినుండీ తీవ్ర వ్యతిరేకతను కనబరుస్తూ వస్తున్న వున్న విషయం తెలిసిందే. కాశ్మీర్ ప్రజలు తమ హక్కులకోసం జరిపే పోరాటంలో వారికున్న ఐక్యశక్తిని బలహీనపరిచే లక్ష్యంతో, కాశ్మీర్ ప్రజలను మతప్రాతిపదికపై విభజించే ఉన్మాదపూరిత ప్రయత్నాలకు కూడా బిజెపి పేరుగాంచింది. ఆసక్తికరంగా, 370వ అధికరణాన్ని అమలుచేయాలని డిమాండ్‌చేస్తూ దానిని ఎత్తిపట్టే పిడిపితో, కాశ్మీర్ ప్రజలను మతప్రాతిపదికపై విభజించటాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించే పిడిపితో కలసి జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. మహబూబా ముఫ్తీ నాయకత్వంలోని బిజెపి-పిడిపి సంకీర్ణ ప్రభుత్వం తమ లోపలి వైరుధ్యాలు, బలహీనతలు మరియు ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి మొదలైన కారణాలతో కుప్పకూలింది. తర్వాత అంతిమంగా కాశ్మీర్‌లో రాష్ట్రపతిపాలన విధించ బడింది. అనగా సారాంశంలో బిజెపి పాలన కొనసాగుతోంది.

ప్రభుత్వాలను ఏర్పాటుచేయటం, తిరిగి మార్పుచేయటమనే ఈ మొత్తం జూదంలో కాశ్మీరు ప్రజలు కేవలం ప్రేక్షకులుగా మిగిలి పోయారు. పాలకవర్గ పార్టీల నడుమ అధికారం కోసం తగవులు, ప్రభుత్వాన్ని ఏర్పరచటంలో వారి వైఫల్యం అనేవి వారి ప్రజాస్వామ్య క్రీడలో సంక్షోభం ఎంత తీవ్రంగా వుందనే అంశాన్ని మాత్రమే ఎత్తిచూపుతోంది.

కాశ్మీర్ ప్రజలు తమ పోరాటంలో అంతులేని అనుభవాలను పొందుతున్నారు. పోలీసుకాల్పులలో వారి సన్నిహితులు, బంధువులు, స్నేహితులు వేలాది మందిని వారు కోల్పోయారు. తమ బిడ్డలను, సోదరులను, తండ్రులను వారివారి పనిప్రదేశాలనుండి లేదా ఇళ్ళనుండి పోలీసులు తీసుకెళ్ళగా, వారు మరెన్నటికీ తిరిగిరాని పలు ఘటనలు కాశ్మీర్ ప్రజలకు అనుభవంలోనివే. రాత్రుళ్ళు తీసుకెళ్ళబడిన తమ వాళ్ళు సజీవంగా వున్నారో లేదో తెలుసు కోవటానికి ప్రభుత్వ కార్యాలయాలకు, పోలీసు స్టేషన్లకు, న్యాయస్థానాలకు వెళ్ళి విచారణ చేసుకోవటం, వారు మరణించివుంటే కనీసం వారి మృతదేహాలను ఎక్కడ ఖననం చేశారో వాకబు చేయటం వారికి అనుభవంలోనిదే. పోలీసు కాల్పులలో మృతిచెందిన వారి మృత శరీరాలను తమకు అప్పగించాలనే డిమాండ్‌తో కాశ్మీర్ ప్రజలు భారీ నిరసనాందోళనను నిర్వహించాల్సి వస్తోంది. పోరాడి, మృత దేహాలను పోలీసు అధికారులనుండి పొంది, ఆ మృతదేహాలకు ప్రేమ ఆప్యాయతలతో, గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించటం కాశ్మీర్‌లో ప్రజలకు పరిపాటి అయింది. జీవనవ్యయం పెరిగిపోవటం, నిరుద్యోగం తీవ్రం కావటం అనేవి ప్రజాందోళనకు ముఖ్యమైన కారణాలుగా వున్నాయి. ప్రత్యేకాధికారాలతో సాయుధమైన భారీసేనలతో అక్కడి ప్రజా ఉద్యమాలను అణచివేయటం జరుగుతోంది. కాశ్మీర్ ప్రజల జీవితాలను అత్యంత అభద్రతకు గురిచేస్తోన్న అంశాలపై చట్టపరమైన చర్యలేమీ తీసుకోకుండా తప్పుకోవటం జరుగుతున్నది.

తుపాకీపై ఆధారపడిన భద్రతాబలగాలు తరచుగా ప్రజాఆందోళనల్లో జోక్యం చేసుకుని, స్వేచ్ఛగా తుపాకులను ప్రయోగించి, ప్రజలపై పెల్లెట్లను ప్రయోగిస్తున్నారు. విశాలమైన ప్రాంతాలను అనేక రోజులపాటు తిరిగి, తిరిగి 144వ సెక్షను విధింపు క్రింది వుంచి, కఠినమైన నిబంధనల నడుమ ప్రజాజీవితాన్ని నిర్బంధి స్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించారనే నేరంపై అనేకమందిమీద తప్పుడు కేసులు బనాయించి ప్రత్యేక చట్టాల పేరుతో వారిని అరెస్టుచేసి వారి సాధారణ జీవితాన్ని తీవ్ర గందరగోళం, భీతావహం చేస్తున్నారు. యుద్ధ తరహా భయానకవాతావరణంలో తామున్నామని కాశ్మీర్ ప్రజలు భావించేలా చేస్తున్నారు.

కాశ్మీర్ ప్రజలు ఎల్లవేళలా భారీజన సందోహంతో నిరసన తెలిపే కార్యక్రమాలనే చేపడతారు. రాజ్యంనుండి, పోలీసులనుండి రెచ్చగొట్టే చర్యలు చేపట్టినపుడు మాత్రమే, ఈ నిరసనాందోళనలు మిలిటెంట్, హింసాత్మక రూపం తీసుకుంటున్నాయి. ప్రజానీకంలో అన్ని వయస్సులవారు, ఆడ-మగ, కుటుంబాలు కుటుంబాలుగా అందరూ ఈ నిరసనాందోళన లలో పాల్గొనటాన్ని మనం చూస్తాం. అలాగే రోజుల తరబడి, తిరిగి తిరిగి ఆందోళనలు సాగినా బాధలను, సాధారణ జీవితానికి కలిగే ఇబ్బందులను, ప్రాణాలకు కలిగే ప్రమాదాన్ని లెక్కచేయక ప్రజానీకం ఐక్యంగా ఆందోళనలలో పాల్గొనటం వీరి ఉద్యమాల ప్రత్యేక లక్షణం. బూటకపు ఎదురుకాల్పుల హత్యాకాండను వ్యతిరేకించటం, అమాయక ప్రజలను వారి ఇళ్ళనుండి ఎత్తుకెళ్ళే ప్రయత్నాలను వ్యతిరే కించటం వారికి మిలిటెంట్‌లని ప్రభుత్వం, భద్రతాబలగాలు పేర్లుపెట్టి వేధించటానికి, కాల్చి చంపటాలకు వ్యతిరేకంగా పోరాడటం-కాశ్మీర్ ప్రజల జీవితంలో భాగమైపోయింది.

కాశ్మీర్ ప్రజలు వారి సుదీర్ఘ పోరాట క్రమంలో, భద్రతాబలగాలు తమనుకూడా మినహాయించవనే స్థితికి చేరుకున్నారు. పుల్వామాలో జరిగినవిధంగా, జరుగుతున్న సంఘటనలో పౌరులు జోక్యం కల్పించుకునే సందర్భాలు పెరుగుతున్నాయి. భారత పాలకులు కాశ్మీర్‌లో టెర్రరిస్టు ప్రమాదాన్ని పెంచటం అనేది, కాశ్మీర్ ప్రజల న్యాయమైన జాతీయ ప్రజాస్వామిక ఆకాంక్షలను, హక్కులను ఉద్దేశ్య పూర్వకంగా నిరాకరించే ప్రయత్నంలో భాగమేనని ప్రజలు, ప్రజాస్వామికశక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇందుకే, కాశ్మీరు సమస్యను మిలిటెంట్లకు-భారత ప్రభుత్వానికి నడుమ సమస్యగా చూపించే ప్రయత్నం చేస్తూ, దానిని ఉపయోగించి క్రూర అణచివేత అనే తమ విధానానికి సమర్ధన చేకూర్చుకుంటున్నారు. కానీ ఇదేమీ ఫలించబోదు. భారత పాలకులు పుల్వామా వంటి ఘటనలనేకం సృష్టించవచ్చు; కానీ ఈ పద్ధతుల్లో కాశ్మీర్ సమస్యకొక పరిష్కారం చూపలేరు. దీనికి పరిష్కారం ఎక్కడో లేదు; ఇక్కడే మూలాల్లోకి వెళ్ళాల్సివుంది. కాశ్మీర్ ప్రజలు తమ రాజకీయ భవితవ్యాన్ని గురించి స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తంచేయ టానికి వీలుగా తక్షణం కాశ్మీర్‌లో ప్రజాస్వామిక, స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణాన్ని, పరిస్థితులను కల్పించాల్సిన అవసరముంది. ప్రజల ఆకాంక్షలను తృణీకరించటం, ప్రజల కోర్కెలకు విరుద్ధంగా పరిష్కారాలను వారిపై రుద్దబూనుకోవటం, ప్రజలను అణచివేయ గలమని కలలుగనటం-భారత పాలకవర్గాలను మరింత లోతైన సంక్షోభపు ఊబిలో కూరుకు పోయేట్లు మాత్రమే చేయగలదు.

ooooo